
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
సోమవారం 11 నవంబరు 2024

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిం చనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మున్సిపల్, మండల స్థాయిలో ఈ కార్యక్ర మం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాయమవుతున్న నది

కర్నూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నది ఉనికి కోల్పోతున్నది. తుంగభద్ర ఉప నదిగా జిల్లా నీటిపారుదల వ్యవస్థలో హంద్రీకి ప్రాధాన్యత ఉంది. అలాంటి నది కబ్జా కోరల్లో చిక్కుకున్నది. కల్లూరు మండలం దేవనగర్ దగ్గర పేరుగాంచిన రియల్టర్ ఒకరు నది పరంబోకు స్థలం అక్రమించాడు.. నిబంధనలు తుంగలో కలిపేసి బఫర్ జోన్‌లోనే పక్కా భవనాలు నిర్మించాడు. జలవనరుల శాఖ ఇంజనీర్లు ఫిర్యాదులు చేసినా రివెన్యూ, నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదు. టీడీపీ నాయకుల అండదండలతో చిన్నటేకూరు గ్రామం దగ్గర హంద్రీ నది భూముల్లో కొందరు ఏకంగా వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. అక్కడ ఎకరం రూ.1.50 కోట్లు పైమాటే. నాడు అధికారం మాటున వైసీపీ నేతలు కబ్జాలకు పాల్పడితే.. నేడు టీడీపీ ముఖ్య నాయకుల పేర్లు చెప్పి నదీ స్థలాల్లో జెండా పాతుతున్నారు. అలారుదిన్నె నుంచి కల్లూరు వరకు హంద్రీనది తీరం కబ్జాకు గురవుతున్న తీరుపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్న హంద్రీ నది పరంబోకు భూములు ఇవే..

- కల్లూరు మండలం దేవనగర్ దగ్గర హంద్రీని ఆక్రమించిన ఓ రియల్టర్
- చిన్నటేకూరు దగ్గర కబ్జాకు గురవుతున్న నది భూమి
- అనధికారింగా వెంచర్ వేసి ప్లాట్లు అమ్మేందుకు యత్నాలు
- టీడీపీ నాయకుల అండతో పెట్రేగుతున్న అక్రమార్కులు
- పెద్దపాడు వద్దేని వంకను కాజేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి
- పట్టించుకోని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు


ఆస్పరి మండలం అలారుదిన్నె..హంద్రీ నది మొదలయ్యేది ఇక్కడే..

పత్తికొండ మండలం పందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహుల్తి ఎగువన మరో పాయ (వంక)గా మొదలయ్యే హంద్రీనది దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో కలిసి దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహిస్తూ.. కర్నూలు నగర శివారు జొహరాపురం దగ్గర తుంగభద్రలో కలుస్తున్నది. నగరం మధ్యలో 5.40 కి.మీలు హంద్రీ ప్రవహిస్తుంది. నదిని సంరక్షించాల్సిన జలవనరుల శాఖ అధికారులు కళ్లకు గంతులు కట్టుకున్నారు. ఫలితంగా రూ.కోట్లు విలువైన హంద్రీనది పరంబోకు భూములు కబ్జాకు గురవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో హంద్రీ, వక్కేరు నదులు ఇష్టారాజ్యంగా అక్రమించారని నాడు టీడీపీ నేతలు ఆరోపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమణలు తొలగించి నదిని కాపాడుతారని ప్రజలు ఆశిస్తే.. ఇందుకు విరుద్ధంగా టీడీపీ ముఖ్య నాయకుల పేర్లు చెప్పి నిబంధనలు విరుద్ధంగా నది తీర భూముల్లో వెంచర్లు వేయడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.


పెద్దపాడు వద్ద రియల్టర్ వడ్లేని వంకను కలిపేసుకొని నిర్మించుకున్న సీసీ కాంక్రీట్ గోడ

మిగతా 6లో..



కమనీయం శ్రీవారి కల్యాణం

వైభవంగా ఆర్జిత సేవలు

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో శ్రీవారికి జరిగే నిత్య పూజా కైంకర్య వేడుకలను నగర భక్తుల సమక్షంలో నిర్వహించడానికి ఆదివారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వైకుంఠవాసుని ఆర్జిత సేవలు చేపట్టారు. నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ మైదానంలోని ప్రధాన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి పూజాదికాలు నిర్వహించారు. రాత్రి జరిగిన శ్రీవారి కల్యాణోత్సవం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష గౌరవాధ్యక్షుడు కె. క్రిష్టన్న, డాక్టర్ ఎం. మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు ఎస్‌జీ మహాబలేష్ తిదితరులు పాల్గొన్నారు.



బాధితులంతా కలెక్టరేట్‌కే

- నమ్మకం కల్పించని మండల యంత్రాంగం
- సమస్యను పరిష్కరించకుండానే ఫైల్ క్లోజ్
- ప్రతి వారం రద్దీగా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంలో అనేక అంచెల వ్యవస్థలు ఉన్నాయి. ఊళ్లలో గ్రామ, వార్డు సచివాలయాలు పని చేస్తున్నాయి. ప్రతి మండలంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తదితర ప్రభుత్వ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎమ్మార్వో కార్యాలయం నుంచి కమిషనర్ కార్యాలయం వరకు వెళ్లి బాధితులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలి. కానీ క్షేత్రస్థాయి అధికారులు ఆ నమ్మకం ఇవ్వడం లేదు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున పోటెత్తుతున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ యంత్రాంగ కర్తవ్యం. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడానికి ప్రయత్నించాలి. దీని కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలో, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రభుత్వం నిర్వహిస్తోంది. కానీ అక్కడ అధికారులు సమస్యలు పరిష్కరించకుండానే ఫైల్ మూసేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితులు కర్నూలే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెళ్లక తప్పడం లేదు. కింది స్థాయిలో పరిష్కారంకాని సమస్యలు మాత్రమే కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి వెళ్లాలి. కానీ దీనికి పూర్తి భిన్నంగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మిగతా 6లో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి


దానియేలు (ఫైల్) ఇర్ఫాన్(ఫైల్)

ఎమ్మిగనూరు/నందవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నందవరం మండలంలోని ముగతి, ధర్మాపురం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దకడుబూరు మండలం జాలవాడికి చెందిన దానియేలు(24), కమ్మలదిన్నెకు చెందిన వంశీ(21) ఒకే బైకుపై వెళ్తున్నారు. ఎమ్మిగనూరు మైనార్టీ కాలనీకి చెందిన ఇర్ఫాన్(21) ఓ బైకుపై వెళ్తున్నారు. అయితే రెండు బైకులు ఢీకొనడంతో దానియేలు, ఇర్ఫాన్ అక్కడిక్కడే మృతి చెందారు. వంశీ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు కూడా మృతి చెందాడు. నందవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిసింది. జిల్లాలో ఫారం-6లో 1854, ఫారం-7లో 636, ఫారం-8లో 1062 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 2203 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో, అసిస్టెంట్ ఈఆర్వోలు తనిఖీ చేశారు.

ప్రగతి కోసం..

ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కృషి చేయాలి

నేటి నుంచి 11 రోజులు అసెంబ్లీ సమావేశాలు

7

కష్టాల్లో ఉర్దూ పాఠశాలలు

- ఉపాధ్యాయుల కొరత
- ఆగిన పాఠశాల భవనాల పనులు
- ఉన్నత చదువులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


చాగలమర్రిలో ఒకే గదిలో చదువు చెబుతున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో ఉర్దూ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయి. తెలుగు, ఆంగ్ల పాఠశాలల్లో ఉర్దూ బోధన కొనసాగడం లేదు. 1 నుంచి 5వ తరగతి మాత్రమే ఉర్దూ పాఠశాలలో విద్యాబోధన కొనసాగుతోంది. 5వ తరగతి తర్వాత ఉర్దూ విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం లేదు. దీంతో వాళ్ల చదువు ఆగిపోతోంది. ప్రభుత్వం యూపీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినా ఉపాధ్యాయుల కొరత, తరగతి గదులు లేక ఆ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. జిల్లాలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు 73, యూపీ పాఠశాలలు 24, ఉన్నత పాఠశాలలు 17 ఉన్నాయి. ఉర్దూ పాఠశాలల్లో 6,195 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయుల కొరత, అసంపూర్తిగా భవనాలతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. గత వైసీపీ పాలనలో నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలలను పట్టించుకోలేదు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉర్దూ విద్యకు గడ్డు రోజులు తయారయ్యాయి. ఆళ్లగడ్డ మండలంలో 2 ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఉండగా అందులో 70 మంది చదువుతున్నారు. ఓబుళంపల్లెలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఐదుగురే ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. శిరివెళ్ల మండలం యర్రగుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదుగురికి గాను నలుగురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. బోయలకుంట్లలో గతంలో 60 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయ పోస్టులను 3 నుంచి 2కు తగ్గించారు. శిరివెళ్ల మండల కేంద్రంలో 2 యూపీ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతున్నారు. దొర్నిపాడు మండలం లోని చాకరాజువేముల, దొర్నిపాడు యూపీ పాఠశాలలో ఉర్దూ బోధిస్తున్నారు.

మిగతా 7లో..


నేలపైనే కూర్చున్న విద్యార్థులు

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం



నీలాకాశంతో కనువిందు చేస్తున్న ఆలయ పరిసరాలు



స్వయంభువుగా వెలసిన మహానందీశ్వరస్వామి

- మహదానంద క్షేత్రం మహానంది
- అద్భుతమైన జలసంపద ఇక్కడి ప్రత్యేకత
- కోనేటి నుంచి నిరంతరం నీటి ప్రవాహం
- రెండో లేపాక్షిగా ప్రసిద్ధిగాంచిన రాతి నంది
- ఆకట్టుకుంటున్న బాదామి చాళుక్యుల శిల్ప కళ
- మహిమాన్వితుడు మహానందీశ్వరుడు
- ప్రత్యేక పూజల కోసం తరలి వస్తున్న భక్తులు

మహానంది, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు, ఆహ్లాదానికి నిలయం మహానంది క్షేత్రం. ఎప్పటికీ తరగని నీటితో ప్రత్యేకతను సంతరించుకున్న ఆలయం. శివ కేశవులిద్దరూ కొలువైన క్షేత్రం ఇది. పచ్చటి ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలారావాలతో ఇక్కడి పరిసరాలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. అద్భుత జలసంపన్నుడిగా మహానందీశ్వరుడు నిత్య పూజలందుకుంటున్నాడు. స్వయంభువుగా వెలసిన స్వామివారి చెంత ఉన్న శిల్ప కళ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నారీమణులతో రూపుదిద్దిన అశ్వం, ఏనుగులతోపాటు సిద్ధి, బుద్ధి గణనాథుల శిల్పాలు సైతం ఇక్కడ కనిపిస్తాయి. నందన మహారాజులు, శ్రీకృష్ణ దేవరాయలు లాంటి ఎందరో చక్రవర్తులు మహానందికి వచ్చారని చరిత్ర చెబుతోంది. మహానందీశ్వర స్వామి గర్భాలయం బాదామి చాళుక్యులు ఆరో శతాబ్దంలో నిర్మించినట్లు పురావస్తు శాఖ అధికారులు చెబుతుంటారు. మహానంది క్షేత్రానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్నది.

మహానంది అంటే గుర్తుకు వచ్చేది కోనేరులే..



మహానందిలో శివరాత్రి ఉత్సవాలతోపాటు కార్తీక మాసం, దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం కార్తీక మాసం ఉత్సవాలు కన్నులపండుగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో దీపం, స్నానాలకు ఎంతో విశిష్టత ఉంది. మహానందిలో గంగాదేవి స్వయంభువుగా వెలసిందని భక్తులు చెబుతారు. అందువల్లే పుణ్యస్నానాలు చేసేందుకు అమితాసక్తిని చూపుతారు. మహానంది అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఇక్కడి కోనేరులే. దీంతో భక్తులు కార్తీక మాసంలో నెల పొడవునా పెద్దకోనేరు (రుద్రగుండం)లో కార్తీక పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులకు అనుమతించారు. మహానంది ఆలయం ముందు ఏర్పాటు చేసిన అతి పెద్ద రాతి నంది విగ్రహం చుట్టూ ఫౌంటెయిన్, పచ్చటి పూల మొక్కలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడి రాతి నంది రెండో లేపాక్షిగా ప్రసిద్ధి చెందింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వచ్చి మహానందీ శ్వరుడిని దర్శించుకుంటున్నారు.



ఆలయం ముందు ఉన్న నంది సర్కిల్

రెండు వేల ఎకరాలకు కోనేటి నీరు

మహానంది ఆలయ పరిసరాల్లోని పొలాలకు నిత్యం కోనేటి నీరు సరఫరా అవుతోంది. దాదాపు రెండు వేల ఎకరాలకు ప్రతి రోజూ రైతులు కోనేటి నీరును పారించుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా అరటి, పసుపు తోటలు సాగవుతున్నాయి. వరిని కూడా విరివిగా పండిస్తున్నారు. వీటన్నింటికీ కూడా మహానంది కోనేరు నీటినే రైతులు వినియోగించుకుంటున్నారు. ఇక్కడే పండే అరటికి ప్రత్యేక ఉంది. అరటి పండ్లు చిన్నవిగా ఉండి బాగా తీపిగా ఉంటాయి. దీంతో ఇతర ప్రాంతాలకు ఈ పండ్లను విరివిగా ఎగుమతి చేస్తుంటారు.

గుండుసూది పడినా కనిపించేంతగా..



మహానంది క్షేత్రంలోని కోనేరు నీటికి ఓ ప్రత్యేక ఉంది. గుండిసూది పడినా కనిపించేంత స్వచ్ఛంగా ఇక్కడి నీరు ఉంటుంది. దీనికితోడు నీరు పెరగడం, తరగడం ఉండదు. ఎప్పుడు ఒకే స్థాయి వరకు ఉంటుంది. వేసవి కాలం వచ్చినా అంతే నీరు రుద్రగుండం కోనేరులో ఉంటుంది. అంతేగాకుండా ఈ కోనేరులో స్నానాలు చేస్తే చర్మ రోగాలు వంటివి నయమవుతాయని భక్తులు చెబుతుంటారు.



ఆకట్టుకుంటున్న శిల్పం



నారీమణులతో అశ్వ శిల్పం

ఎవరికీ అంతుబట్టని జల సంపద

మహానంది క్షేత్రంలోని రుద్రగుండం కోనేటిలోకి నీరు ఎలా వస్తుందనేది ఇప్పటికీ ఎవరికీ అంతుబట్టడం లేదు. నల్లమల అడవుల నుంచి భూగర్భం ద్వారా నీటి ధారలు కోనేరులోకి వచ్చి కలుస్తుంటాయని కొందరు చెబుతున్నారు. కోనేరులోకి నీరు ఎలా వచ్చే విషయం తెలియకున్నా ఇక్కడి నుంచి మాత్రం నీరు దిగువకు వెళ్తూనే ఉంటుంది. ఆలయ పరిసరాల్లో ఉన్న మరో రెండు కోనేర్లలోకి నీరు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ రుద్రగుండం కోనేరులో మాత్రం నీరు తరగడం లాంటిది అస్సలు కనిపించదు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు, భరోసా ఉంటాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఆర్‌పేటలో నిర్వహిం చిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మానికి రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వర రావు యాదవ్, నంద్యాల నాగేంద్ర, ఆకెపోగు ప్రభాకర్‌లతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నందమూరి తారక రామారావు తరువాత నారా చంద్ర బాబు నాయుడు పార్టీని ముందుకు తీసుకెళ్తూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందు తున్నారన్నారు. ఇప్పటికే 70 లక్షల సభ్యత్వంతో బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. ప్రతి కార్యకర్త చెల్లించిన సభ్యత్వ రుసుం మొత్తం తిరిగి కార్యకర్తలకు లబ్ధి చేకూరే విధంగా యువనే నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి ఇన్సూ రెన్సు పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. చనిపోయిన కార్య కర్తలకు గతంలో ఇచ్చిన రూ 2లక్షల పరిహారం రూ. 5 లక్షలకు పెంచారని అన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ లెక్చరర్‌గా సౌజన్య



డోన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని బి.క్యాంపు బాలికల జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న సౌజన్యకు రాష్ట్ర స్థాయి ఉత్తమ లెక్చరర్ పురస్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ టీచర్స్ అవార్డుల్లో ఆమెకు ఈ పురస్కారం లభించింది. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సతీమణి సౌజన్య కర్నూలు నగరంలోని బి.క్యాంపు బాలికల జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తన ఉద్యోగ కాలంలో అందించిన సేవలకు, సాధించిన ఫలితాలకు గుర్తింపుగా ఇంటర్మీడియట్ విభాగంలో సౌజన్యకు ఉత్తమ జూనియర్ లెక్చరర్ అవార్డు లభించింది. తేదీ సోమవారం విజయవాడలో జరిగే జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సౌజన్య ఉత్తమ లెక్చరర్ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఉత్తమ లెక్చరర్ అవార్డు రావడం పట్ల సౌజన్యతో పాటు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

బాధితులంతా కలెక్టరేట్‌కే

(5వ పేజీ తరువాయి)

కర్నూలు జిల్లాలో దాదాపు 26 మండలాలు ఉన్నాయి. చిన్న మండలం పరిధిలో 10 గ్రామాలు, పెద్ద మండలం పరిధిలో 20 నుంచి 24 గ్రామాలు న్నాయి. మండల పరిధిలో తహసీ ల్దార్లు, ఎంపీడీవోలు సమ స్యల్ని పట్టించుకుని పరిష్కరిస్తారన్న నమ్మ కం బాధితులకు కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయి. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించి ఆ ఫైల్‌ను క్లోజ్ చేయాలి. కానీ కొం దరు అధికారులు విచారణ జరప కుం డానే తప్పుడు సమాచారంతో ఫైళ్లను క్లోజ్ చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో అధిక శాతం రెవెన్యూ భూ సమ స్యల ఎక్కువగా వస్తున్నాయి. వాటి పరిష్కారంలో స్థానిక అధికారులు సరిగా వ్యవహరించడం లేదనే అసంతృప్తి ప్రజల్లో ఉంది.

భూ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం:

ప్రతి గ్రామంలో రైతులు భూ సమస్యలుపై వీఆర్వో, ఎమ్మార్వో గ్రామ సర్వేకు ఫిర్యాదు చేస్తున్నారు. భూసర్వే సమస్యల పరిష్కారం కోసం గత నెల 8వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు.

ఇన్‌చార్జిల పాలనతో అస్తవ్యస్తం

జిల్లాలోని వివిధ శాఖలలో అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. కొందరు అధికారులకు రెండు, మూడు శాఖల బాధ్యతల్లో ఉండటంతో పాలనపై దృష్టి సారించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల ఆ శాఖలలో ఉన్న అధికారులు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు గ్రామ, వార్డు సచివాలయాల మీద ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తనిఖీ లేకపోవడంతో సచివాలయల సిబ్బంది ప్రజలు సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు. సచివాలయాలు, మండల కార్యాలయాలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే మంచి పరిపాలన అందించవచ్చని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

- కర్నూలు డివిజన్‌లో కల్లూరు మండలంలో 1484, కోడుమూరు మండలంలో 911, ఓర్వకల్లు మండలంలో 819, వెల్దుర్తి మండలంలో 781, మండలంలో 705, కర్నూలు రూరల్ మండలంలో 601లు ఉన్నాయి.
- ఆదోని డివిజన్‌లో మంత్రాలయం మండలంలో 989, పెద్దకడుబూరు మండలంలో 929, ఆదోని మండలంలో 822, గోనెగండ్ల మండలంలో 611, ఎమ్మిగనూరు మండలంలో 565, కోసిగి మండలంలో 402 ఉన్నాయి.
- పత్తికొండ డివిజన్‌లో దేవనకొండ మండలంలో 895, తుగ్గలి మండలంలో 877, ఆలూరు మండలంలో 708, ఆస్పరి మండలంలో 690, హాలహర్వి మండలంలో 708, రైతుల భూసమస్యలపై వినతులు ఇచ్చారు.

రీసర్వే జరిగిన గ్రామాల్లో సరాసరిగా రెవెన్యూ గ్రామసదస్సులో 100 నుంచి 500 వరకు రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మండల స్థాయిలో భూసమస్యల పరిష్కారం కాకపోతే కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిస్కార వేదికలో అర్జీలు ఇచ్చేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

మాయమవుతున్న నది

(5వ పేజీ తరువాయి)



పెద్దపాడు వద్ద రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కలిసిపోయిన వడ్లేని వంక

కల్లూరు మండలం చిన్నటేకూరు పక్కన హంద్రీ నది ప్రవహిస్తుంది. ఈ ప్రాంతం హైదరాబాదు - బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారికి సమీపంలో ఉంటుంది. హంద్రీ నది కలుపుతూ వంక ప్రవహిస్తుంది. సర్వే నంబరు 1లో 130 ఎకరాలు నది పరంబోకు భూములు ఉన్నాయని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఊరు పక్కనే పరంబోకు ప్రభుత్వ భూములను ఆ ఊరికి చెందిన కొందరు రైతులు పట్టాలు లేకున్నా సాగు చేసుకొని జీవిస్తున్నారు. ఆన్‌లైన్ అడంగల్ రికార్డులు పరిశీలిస్తే.. పరంబోకు ప్రభుత్వ భూమిగానే కనిపిస్తుంది. జాతీయ రహదారికి సమీపంలో ఉండడం, అక్కడికి దగ్గర్లోనే సూరత్ - చెన్నై వయా కర్నూలు జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుండడంతో ఆ భూములకు భారీగా డిమాండ్ వచ్చింది. ఎకరం కనిష్ఠంగా రూ.1.50 కోట్లు పలుకుతోందని స్థానికులు అంటున్నారు. ఆ భూములపై కన్నేసిన అక్రమార్కులు రాజకీయ నాయకుల అండతో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్లాట్లు అమ్మేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది హంద్రీ నది పరంబోకు భూములు.. ఇక్కడ వెంచర్లు ఎలా వేస్తారు..? అని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తే తాము ఓ వ్యక్తి ద్వారా కొన్నామని, తాము నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మనుషులమని చెబుతున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. రెవిన్యూ అధికారులు, జలవనరుల అధికారులు అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకొని హంద్రీ నది పరంబోకు భూములు కబ్జాల కోరల నుంచి సంరక్షించాలని కోరుతున్నారు. హంద్రీనది పరివాహకంలో ఉండే చిన్నటేకూరు, పెద్దటేకూరు, బస్తిపాడు, లక్ష్మీపురం, పందిపాడు, పసులూరు, నాయకల్లు, రేమడూరు, బొల్లవరం, కల్లూరు ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే చేసి హంద్రీనది పరంబోకు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కబ్జాకు గురికాకుండా నది రెండు వైపులు 100-200 మీటర్లకు ఒకటి చొప్పున సరిహద్దు సిమెంట్ దిమ్మెలు కట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటాం

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం సర్వే నంబరు 1లో హంద్రీ నది పరంబోకు ప్రభుత్వం భూమి 130 ఎకరాలు ఉంది. ఎక్స్‌కవేటర్లతో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసేందుకు కొందరు వ్యక్తులు ప్రభుత్వం భూములను చదును చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో తక్షణమే ఆపేశాం. హంద్రీ నది పరంబోకు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నది ఒడ్డున ప్రభుత్వ బఫర్ జోన్ భూముల్లో వేసిన ప్లాట్లను కొంటే నష్టపోతారు. పెద్దపాడు వడ్లేని వంక అక్రమణపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

- కె. ఆంజనేయులు, తహసీల్దార్, కల్లూరు

వంకను కలిపేసుకున్నారు

కల్లూరు మండలం పెద్దపాడు గ్రామం కర్నూలు నగరంలో అంతర్భాగమైంది. అక్కడి స్థిరాస్తి వ్యాపారానికి రెక్కలు వచ్చాయి. ఎకరం రూ.4-5 కోట్లకు పైగా పలుకుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రైవేటు పట్టా భూముల్లో వెంచర్లు వేస్తూ.. పక్కనే ఉన్న వంకలు, వాగులు, ప్రభుత్వ పరంబోకు భూముల్ని కలిపేసుకుంటున్నారు. పెద్దపాడు ఎస్సీ కాలనీ సమీపంలో ఒకప్పుడు వడ్లేని వంక ప్రవహించేది. రికార్డుల ప్రకారం సర్వే నంబరు 128, 138 పరిధిలో 1.80 ఎకరాల వంక పరంబోకు భూమి ఉంది. ఇప్పుడు అది మాయమైంది. దాని పక్కనే గత వైసీపీ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు ఓ రైతు నుంచి ప్రైవేటు భూమిని కొని.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి 1.80 ఎకరాలు కూడా కలుపుకొని ఏకంగా కాంక్రీట్ గోడ కట్టేశారని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడుగా చెప్పుకుంటున్న వ్యక్తి అండతో ఈ భాగోతం సాగినట్లు తెలుస్తోంది. కబ్జాకు గురైన భూమి విలువ దాదాపు రూ.10 కోట్లు పైమాటే అని గ్రామస్తులు అంటున్నారు. వంక కబ్జాకు గురికావడంతో వర్షాకాలంలో భారీ వర్షాలు వస్తే ఎస్సీ కాలనీ ముంపునకు గురవుతున్నది.

డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు



కలెక్టర్‌ను కలిసిన డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్, సభ్యులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే. దినేష్ కుమార్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు ప్రాంతంలో 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఓర్వకల్లు మండలం పాలకొలను, కొమరోలు వద్ద డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువైన స్థలాలుగా సూచించామని తెలిపారు. డ్రోన్ హబ్ ఏర్పాటు వల్ల జిల్లాలో ఎంతో మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తా

● ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యారంగం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక టౌన్ మోడల్ హై స్కూల్‌లో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత పెంచాలని, అందుకు అవసరమైన మెటీరియల్స్‌ను, బుక్స్‌ను తన ఎంపీ నిధులతో విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. అనంతరం జిల్లాలో 2024 జనవరి నుంచి అక్టోబరు నెల వరకు పదవీ విరమణ పొందిన 25 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులను ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ పాల్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, ఎంఈవో ఓంకార్ యాదవ్, సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి హుశేన్, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, గోవిందరెడ్డి, ఆదాం బాషా, నాగరాజు, వనజ కుమారితో పాటు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం



కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 6 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను పీసీసీ కార్యాలయం నియమించిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కర్నూలు నియోజకవర్గానికి షేక్ జిలానీ బాషా, కోడుమూరుకు పరిగెల మురళీకృష్ణ, ఎమ్మిగనూరుకు ఎం ఖాశీం వలీ, ఆదోనికి జి. రమేష్ యాదవ్, మంత్రాలయానికి పీఎస్ మురళీకృష్ణరాజు, ఆలూరుకు చిప్పగిరి లక్ష్మీనారాయణలను సమన్వయకర్తలుగా నియమించారని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహకు అదనపు బాధ్యతలు



లక్ష్మీనరసింహ యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పజెపుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

నంద్యాల/పాణ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్‌కు పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. జమిలీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరో 50మందిని కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్తలుగా నియమిస్తూ జాబితాను విడుదల చేశారు. అందులో భాగంగా పాణ్యం నియోజకవర్గ సమన్వయకర్తగా లక్ష్మీనరసింహ యాదవ్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తుగ్గలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 1988 నుంచి 93 వరకు 6 నుంచి 10వ తరగతి చదివిన వారు దాదాపు 32 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆ బ్యాచ్‌లో మృతి చెందిన 12 మంది స్నేహితులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అలాగే సమ్మేళనానికి విచ్చేసిన ఆనాటి ఉపాధ్యాయులు హుశేన్‌సాహెబ్, గోపాల్ శర్మ, రాముడు, గంగన్నతో పాటు ప్రధానోపాధ్యాయులు నరేంద్రప్రసాద్‌లను సన్మానించి మెమెంటో అందజేశారు. అనంతరం పాఠశాలకు ప్రింటర్, జిరాక్స్ మిషన్‌లను అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

హేతువాద సంఘం

జాతీయ ప్రధాన కార్యదర్శిగా జేవీ కృష్ణయ్య



కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హేతువాద సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు జేవీ కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఒంగోలులో శని, ఆదివారాలు జరిగిన హేతువాద సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే శ్రీనివాస్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి. సమరం తదితరులు హేతువాదం ఆవశ్యకతపై ప్రసంగించారు. ఈ సభల్లో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా జేవీ కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా విష్ణుమూర్తి, టి. బాలచందర్, సంయుక్త కార్యదర్శులుగా ఎం. సత్యనారాయణ, బి. సత్తెన్న ఎన్నికయ్యారు.

ఆస్తి కోసం తండ్రిని హత్య చేసిన కొడుకు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

చిప్పగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడ్ని ఆదివారం అరెస్టు చేశారు. ఆస్తి కోసం కొడుకే కన్నతండ్రిని చంపినట్లు తెలిపారు. చిప్పగిరి-గుంతకల్ మధ్య ఓ పొలంలో సెప్టెంబర్ 13వ తేదీన కురువ కారుమంచప్ప చెట్టుకి ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన తెలిసిందే.. ఆదివారం చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటరామయ్య ఈ ఘటనపై తెలిపిన వివరాల మేరకు... కారుమంచప్ప పెద్ద కుమారుడు శ్రీనివాసులు ఆస్తి కోసం తండ్రిని చంపి చెట్టుకు ఉరివేశాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. 20 ఎకరాల పొలం ఉంది. పెద్ద కుమారుడు శ్రీనివాసులకు మాగాణి పొలాన్ని ఇచ్చాడు. చిన్న కుమారుడు ప్రసాద్‌కు విలువైన పొలాన్ని ఇచ్చాడు. 12 ఎకరాల పొలంలో ఆరు ఎకరాల తన భార్య పేరున రాశాడు. మిగిలిన ఆరు ఎకరాలను ఇద్దరు కూతుళ్లకు సమానంగా పంచి ఇస్తానని చెప్పడంతో కొడుకు తగాదా పడ్డాడు. 12 ఎకరాలు తనకే ఇవ్వాలని పెద్ద కొడుకు తరచూ తగాదా పడేవాడు. ఈ విషయంపై పెద్ద మనుషులతో పంచాయితీ కూడా జరిగింది. తండ్రి ఉంటే తనకు ఆస్తి రాదని భయంతో పెద్ద కొడుకు శ్రీనివాసులు పథకం ప్రకారం ఈ హత్యకు పాల్పడ్డాడు. గుంతకల్ నుంచి చిప్పగిరికి వస్తున్నప్పుడు దారిలో తండ్రిని చంపి, తాము కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు వేలాడదీశాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ వెంకట్రామయ్య వివరించారు.

కష్టాల్లో ఉర్దూ పాఠశాలలు



దెబ్బతిన్న ఉర్దూ పాఠశాల భవనం

5వ పేజీ తరువాయి

రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో ఉర్దూపాఠశాల ఉంది. చాగలమర్రిలో 1 నుంచి 8వ తరగతి వరకు 68 మంది విద్యార్థులు, 9 నుంచి 10వ తరగతి వరకు 15 మంది విద్యార్థులు ఉన్నారు. . ముస్లిం జనాభా ఎక్కువగా ఉండటంతో ప్రాథమిక పాఠశాలను 1 నుంచి 10వ తరగతి దాక మరో పాఠశాలను ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఉన్న ముగ్గురు టీచర్లే అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఉర్దూ పాఠశాల స్థాయిని అప్‌గ్రేడ్ చేశాక అవసరమైన సౌకర్యాలు కల్పించలేదు. గదుల కొరతతో ఒకే గదిలో 5 తరగతులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనంలో మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి ఉపాధ్యాయులు లేరు. వసతులు లేక, ఉపాధ్యాయులు లేక 9, 10 తరగతులు చదివే విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్తున్నారు. కోటగడ్డ ప్రాథమిక పాఠశాలలో 25 మంది ఉండగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు మాత్రమే ఉంది. పెద్దవంగలిలో ముస్లిం జనాభా 60 శాతం పైగా ఉంది. ఇక్కడ ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయకుండా అక్కడ ఉన్న పాఠశాలలో ఒక ఉర్దూ పోస్టు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. పాఠశాలలో తాగునీరు, వంటగది, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. పాఠశాల భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. గత టీడీపీ ప్రభుత్వ హయంలో రూ.24 లక్షల మైనార్టీ నిధులతో భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు చేపట్టారు. ఇందులో రూ.23 లక్షల వరకు పనులు చేశామని, మరో రూ.5 లక్షల బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగిపోయాయి. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు. నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలను రెండో విడతలో ఎంపిక చేసి తిరిగి తొలగించేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలోనే ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి చదువు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● **పది తరువాత ఎలా..**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉర్దూ మాధ్యమంలో పది వరకు చదువుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకు ఉర్దూ కళాశాల లేదు. ఉర్దూ మాధ్యమంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోవడం లేదు



ఉర్దూ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నాడు-నేడు పనుల కింద గత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించలేదు. తరగతులు పెంచారు కానీ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయలేదు. భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

- మాబుహుసేన్, హెచ్ఎం, చాగలమర్రి

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు



ఉర్దూ పాఠశాలలోని సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాల భవనాలకు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారు. నాడు-నేడు కింద ఉర్దూ పాఠశాలను ఎంపిక చేయకపోవడం వాస్తవం.

- అనూరాధ, ఎంఈవో, చాగలమర్రి

సెల్‌ఫోన్‌ను అభివృద్ధికి ఉపయోగించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, జి.పుల్లయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అరచేతిలోకి సెల్ రూపంలో వచ్చిన ఆధునిక విజ్ఞానాన్ని అభివృద్ధికే ఉపయోగించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య రాసిన 'సెల్లు (సెల్‌ఫోన్) పురాణం' శతక పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ తొలుత పుస్తకాన్ని అంకితం ఇచ్చిన దివంగత విశ్రాంత ప్రిన్సిపాల్.. నెల్లూరుకు చెందిన పమిడి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ రాకతో ప్రపంచంలో ఎక్కడికైనా క్షణాల్లో సంప్రదింపులు జరిపే అవకాశం ఏర్పడిందని అన్నారు. అయితే సెల్‌ఫోన్‌ను విజ్ఞానానికి, వినోదానికి ఉపయోగించుకోవాలని అన్నారు. అయితే కొంతమంది దీనివల్ల పెడదోవ పట్టే ప్రమాదం ఉందని అన్నారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, మనిషి జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగంగా మారిందని చెప్పారు. రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి. పుల్లయ్య మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభాలూ, నష్టాలూ ఉన్నాయని, అయితే లాభాలకే వాడుకోవాలని అన్నారు. రచయిత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ వినియోగం ఎలా మారిందో తెలియజేసేందుకు ఈ పుస్తకం రాశానని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు మహ్మద్ మియా, కె. బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, శ్యామ్యూల్ సెల్లు పురాణంలోని హాస్య శతక పద్యాలను చదవి వినిపించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పత్తి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. గత వారంలోనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సిన సీసీఐ సంస్థ పత్తిలో తేమ ఎక్కువగా ఉందని మీనమేషాలు లెక్కిస్తూ వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని సీసీఐ సంస్థ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కర్నూలు జిల్లాలో 6 కేంద్రాలు, నంద్యాల జిల్లాలో 3 కేంద్రాలను సీసీఐ ఏర్పాట్లు చేసింది. తూకం కాటాలతో పాటు వివిధ ఏర్పాట్లను కూడా చేపట్టింది. సోమవారం నుంచి సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనగుళ్ల ప్రారంభమవతాయని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను, వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకోవద్దని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణ మూర్తి తెలిపారు.

వ్యవసాయ రంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

● రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే పోరాటాలే శరణ్యమని, ఆ దిశగా ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దవీరన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు పూనుకుంటున్నాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేని దుస్థితిలో ఉన్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20వేలు ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైత సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ కార్యదర్శి ఉమాపతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హొళగుంద, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ కాలనీకి చెందిన బోయ ఉలిగేష్ (26) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వారం రోజుల క్రితం ఉలిగేష్.. భార్య బళ్లారిలోని ఓపీడీ హాస్పిటల్లో కాన్పు కావడంతో చూసేందుకు బైక్‌పై వెళ్లాడు. తన పెద్దమ్మ సిద్దపురం రంగమ్మతో కలిసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఉలిగేష్ బళ్లారిలోని ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని పెద్దమ్మ మాత్రం చికిత్స పొందుతోంది. దీంతో పాటు పసి బాలుడు సైతం ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. వారం వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెంది, ఒక్కరు తీవ్ర గాయాల పాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కేసీలో యువకుడి గల్లంతు



దినేష్ (ఫైల్)

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వామిరెడ్డినగర్ సమీపంలో ప్రమాదవశాత్తు కేసీలో పడి దినేష్ (20) అనే యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం స్థానిక కాలనీ వద్ద కాళ్లు, చేతులు కడుక్కునేందుకు కేసీలో దిగగా ప్రమాదవశాత్తు జారి పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు గుర్తించి కేసీలో దూకి ఆ యువకుడ్ని వెలికితీసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దినేష్ తండ్రి ఆంజనేయులు ఓ ప్రముఖ దినపత్రిలో ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు, బంధువులు వెంటనే కేసీ వెంట గాలించారు. ఎక్కడా దినేష్ ఆచూరీ లభించలేదు. దినేష్ ఇంటర్ దాకా చదివి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

ప్రగతి కోసం..



- అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రీకరించాలి
- విశ్వవిద్యాయ భవన నిర్మాణాలేమయ్యాయి?
- వలసలతో దెబ్బతింటున్న పల్లె జీవితాలు
- రహదారుల మరమ్మతులు సరే.. శాశ్వత పరిష్కారం ఏదీ..?
- టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలి
- నేటి నుంచి 11 రోజులు అసెంబ్లీ సమావేశాలు
- అమరావతికి బయలుదేరిన కూటమి ఎమ్మెల్యేలు

కర్నూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఎన్నికైన 14 మంది ఎమ్మెల్యేలు జూన్ 21న జరిగిన తొలి అసెంబ్లీ సమావేశాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో 12 మంది టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు. నేటి నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో పాల్గొనేందుకు ఆదివారం అమరావతి చేరుకున్నారు. కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఆదోని, డోన్, నందికొట్కూరు, ఆలూరు ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బి.విరుపాక్షి ఈ ఏడుగురు తొలిసారి ఎన్నికైన వారే. బనగానపల్లె, ఎమ్మిగనూరు, శ్రీశైలం, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బీజీ జయనాగేశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ రెండో పర్యాయం గెలిచారు. నంద్యాల ఎమ్మెల్యే మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నాలుగు సార్లు గెలిస్తే.. పాణ్యం, మంత్రాలయం ఎమ్మెల్యేలు గౌరు చరిత, వై. బాలనాగిరెడ్డి మూడు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరాక రెండో అసెంబ్లీ సమావేశాలు ఇవి. పూర్తి బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం కూడా ఉంది. సీనియర్ ఎమ్మెల్యేలు జూనియర్ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి జిల్లా సమస్యలు, ప్రాజెక్టులపై అసెంబ్లీలో గళమెత్తి అత్యధిక నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● **సాగునీటి ప్రాజెక్టులపై పట్టుబట్టాలి:**

జిల్లాలో కరువు శాశ్వత నివారణ జరగాలంటే తుంగభద్ర, కృష్ణా నదుల వరద జలాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే మెట్ట పొలాలు సస్యశ్యామలమవుతాయి. ప్రజా జీవితాన్ని దెబ్బతీస్తున్న కరువు.. వలసల నివారణ సాధ్యం అవుతుంది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారణే లక్ష్యంగా 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని రూ.1,985.42 కోట్లతో చేపట్టిన ఆర్డీఎస్ కుడి కాలువ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని రూ.1,94.80 కోట్లతో చేపట్టి వేదవతి ఎత్తిపోతల పథకం అసంపూర్తి పనులు చేపట్టాలి. హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి ఎడమ కాలువలు కింద 61 వేల ఎకరాలు సాగునీరు అందాలంటే రూ.200 కోట్లు తక్షణమే ఇవ్వాలి. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూ.2,980 కోట్లు గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు వెంటనే చేపట్టాలి. వీటితో పాటు అలగనూరు జలాశయం, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు నిధులు రాబట్టేలా అసెంబ్లీలో గళం వినిపించాలి.

● **టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలి:**

గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ టిడ్కో ఇళ్లు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరంలో 9185 ఇళ్లు, ఆదోని పట్టణంలో 3,800, ఎమ్మిగనూరు పట్టణంలో 3,250, నంద్యాల 5,075 కలిపి 21,300 ఇళ్లు పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రంగులు వేసి వదిలేసింది. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉంది. నిర్మాణాలు పూర్తయిన 21,300 ఇళ్లు పేదలకు పంపిణీ చేయడంతో పాటు అసంపూర్తి ఇళ్లు ఏడాదిలోగా పూర్తి చేయాలి. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో లక్షల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేసేలా అసెంబ్లీ వేదికగా గళం వినిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇవి కూడా:

● పత్తికొండ ప్రాంత రైతుల చిరకాల స్వప్నం టమోటా జూస్ పరిశ్రమ. 3 వేల హెక్టార్లలో టమోటా సాగు అవుతుంది. టమోటా జూస్ ఫ్యాక్టరీ, టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్, శీతల గిడ్డంగులపై గళం వినిపించాలి.

● కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో పనులు ఆపేశారు. ఈ పనులు మొదలు పెట్టి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

● రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై రూ.20 కోట్ల రూసా నిధులతో చేపట్టారు. అయితే పనులు పునాదులతో ఆగిపోయాయి. ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణం, ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయ భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. ఈ పనులు మొదలు పెట్టాలి.

● జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఈ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి.

● ఉమ్మడి జిల్లాలో ఆర్ అండ్ బీ రోడ్లు, జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికి కుళాయి పనులు మళ్లీ మొదలు పెట్టి పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రాబట్టాలి.

● ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాల నిర్మాణం, కోడుమూరు పట్టణం తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్‌పై గట్టిగా పట్టుబట్టి నిధులు, అనుమతులు రాబట్టేందుకు అసెంబ్లీ వేదికగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

హంద్రీనీవా కాలువపై అసంపూర్తిగా వేదవతి స్టేజ్-2 పంప్‌హౌస్



అభివృద్ధికి ఆమడ దూరం

● అంతర్గత రోడ్లకు నోచుకోని రామాపురం కొత్త కాలనీ
● ఇళ్ల మధ్య పిచ్చిమొక్కలు

కోడుమూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం కొత్త కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడంలేదు. లద్దగిరి గ్రామ పంచాయతీకి మజారా గ్రామమైన రామాపురం కొత్త కాలనీలో సుమారు 200 ఇళ్లు, దాదాపు 600 జనాభా ఉంది. గ్రామంలో పెరుగుతున్న జనాభా


పాఠశాల వద్ద పెరిగిపోయిన పిచ్చిమొక్కలు


కాలనీ సమస్యలను తెలుపుతున్న స్థానికులు

దృష్ట్యా గతంలో ప్రభుత్వం పేదలను గుర్తించి స్థలాలు ఇచ్చింది. ఈ ప్రదేశం లద్దగిరి-వెల్దుర్తి రహదారికి దగ్గరగా ఉండడంతో ఇక్కడ క్రమేణా గృహాల సంఖ్య పెరిగింది. ఈ కాలనీలోనే ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల నిర్మాణం జరుగుతోంది. కాలనీలో అంతర్గత రహదారులు లేవు. ఇళ్ల మధ్యనే పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోయాయి. తాగునీరు, కరెంటు లోవోల్టేజీ వంటి సమస్యలు ఉన్నాయి. దీంతో రాత్రిపూట పురుగుపుట్రా సంచరిస్తున్నాయి. పట్టపగలే పాములు ఇళ్ల మధ్య కనిపిస్తున్నాయి. కాలనీలో సమస్యలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పాములు సంచరిస్తున్నాయి..



కాలనీలో రహదారులు లేవు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి బురదగా మారుతుంది. పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండడంతో పాములు సంచరిస్తున్నాయి. పది రోజుల క్రితం పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు సకాలంలో చికిత్స జరి పించడంతో ప్రాణాలతో బయటపడ్డాను. రోడ్లు ఏర్పాటు చేయాలి.

సునీత, రామాపురం కొత్తకాలనీ

డ్రైనేజీలు నిర్మించాలి



రామాపురం కొత్తకాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేవు. ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చిమొక్కలు, కంప చెట్లు పెరిగాయి. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.

- ఈశ్వరరెడ్డి, రామాపురం కొత్తకాలనీ

ప్రాచీన ఆలయాలను పునరుద్ధరించాలి: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే దస్తగిరికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

కర్నూలు కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన ఆలయాలను పునరుద్ధరించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం పాతనగరంలోని మెయిన్ బజార్‌లోగల పేట శ్రీరాముల వారి ఆలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సీతారాముల కల్యాణం, ఉసిరిక పూజ, ఊంజల సేవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో ప్రాచీన దేవాలయాల్లో ఒకటి పేట రామాలయం అని, మరొకటి రాంభొట్ల దేవాలయం అని చెప్పారు. ఈ రెండు ఆల యాలను పునరుద్ధరించడం నగరవాసులకు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మాళిగి హనుమేశాచార్య, కమిటీ అధ్యక్షుడు చిలుకూరు ప్రభాకర్ మాట్లాడారు. అఖిల భారత కరివేన నిత్యాన్నదాన సత్రం నిర్వాహకుడు డాక్టర్ వేణుగోపాల్ భక్తులకు అన్న ప్రసాద సేవ ప్రారంభించారు. కార్యక్రమంలో కట్టా రాఘవేంద్ర ప్రసాద్, ఎల్కూరి ద్వారకానాథ్, డాక్టర్ రంగయ్య, విఠల్‌శెట్టి, వేదవ్యాస మూర్తి, మాళిగి సత్య, దినేష్, శ్యామ్, సతీష్, మాళిగి వ్యాసరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే 104 వ్యవస్థను నిర్వహించాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): థర్డ్ పార్టీ విధానాన్ని ఎత్తివేసి 104 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం అరవిందో కంపెనీకి 104 వ్యవస్థను నడిపే ఏజెన్సీని ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం వేరే ఏజెన్సీకి ఇవ్వాలని ప్రయత్నిస్తోందన్నారు. దీని వల్ల 104 ఉద్యోగులు అభద్రత భావానికి గురవుతారన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని ఎత్తివేయాలని, నెల నెలా జీతాలు సక్రమంగా చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పెద్దయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి చంద్రహాస్, జిల్లా నాయకురాలు కళ్యాణి, వెంకటేశ్, 104 వాహనాలు ఉద్యోగులు పాల్గొన్నారు.

చేతిరాత బాగుంటేనే ఉజ్వల భవిష్యత్తు


ఉపాధ్యాయులతో డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చేతిరాత బాగుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం స్థానిక టౌన్‌మోడల్ ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీ క్లబ్ ఆధ్వర్యంలో లూసిడా క్యాలిగ్రఫీ వర్క్‌షాప్ జరిగింది. రామ్మోహన్ బృందం ఆధ్వర్యంలో 50 మంది ఉపాధ్యాయులకు లూసిడా చేత రాత పరీక్ష నేర్పించారు. అందమైన చేతిరాత విద్యార్థుల పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి ఉపయోగపడుతాయన్నారు. ఉపాధ్యాయులందరూ విద్యార్థుల చేతిరాతను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, వర్క్‌షాపు నిర్వాహకులు సోమశేఖర్, ముజహర్ హుశేన్, శాంతిప్రియ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లెల రాజశేఖర్‌కు సన్మానం


మల్లెల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఓర్వకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడు మల్లెల రాజశేఖర్‌ను మండలంలోని హుశేనాపురం గ్రామంలో మండల కాపు సంఘం నాయకులు కేవీ మధు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బలిజ, కాపు సంఘం నాయకులు, కార్యకర్తలు, పూల మాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు హేమకుమార్, విక్రమ్, కొమ్ములక్ష్మన్న, గుర్రాల రాజు, త్రిలోక్, మధు, శ్రీనివాసులు, రమేష్, బజారు పాల్గొన్నారు.

సోమిశెట్టికి అభినందన


సోమిశెట్టికి పూల బొకే ఇస్తున్న నాయకులు

ఓర్వకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్‌గా ఎంపికైన సోమిశెట్టి వెంకటేశ్వర్లును టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఆదివారం మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, టీడీపీ నాయకులు ఆకుల మహేష్, కాకి దేవేంద్ర తదితరులు సోమిశెట్టి వెంకటేశ్వర్లును సన్మానించి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

సి.బెళగల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యువకులతో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈసమావేశంలో టీడీపీ నాయకులు బాలాజీ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ గోవిందు, పోలీసులు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి ఆలయంలో పడిపూజ

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం వరంగల్ నుంచి కాలినడకన శబరిమలకు వస్తున్న అయ్యప్ప భక్తులు సూర్యనారాయణస్వామి ధర్శనం చేసుకుని పడిపూజలో పాల్గొన్నారు. పడిపూజలో దాదాపు 350 మంది అయ్యప్ప భక్తులు పాల్గొని అయ్యప్పస్వామికి అభిషేకాలు, పడిపూజ, భజనలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు ఆలయ ట్రస్టీ టి.శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీప్రసాద్ అన్నారు. ఆదివారం మద్దూర్ నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, సాహితీ సదస్సు సంస్థ, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణపై 'ఆయుష్మాన్ భవ' అనే అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లెపోగు నాగరాజు, సాహితీ సదస్సు అధ్యక్ష, కార్యదర్శులు కేసీ కల్కూర, జేఎస్‌ఆర్‌కే శర్మ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు సుబ్బలక్ష్మమ్మ, దండెబోయిన పార్వతీదేవి, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

సి.బెళగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, కొండాపురం, గుండ్రేవుల, సిబెళగల్ గ్రామాల్లోని ఓటరు నమోదును తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 64 ఓటరు నమోదు దరఖాస్తులు అందా యన్నారు. ఆయన వెంట వెంట డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, బీఎల్‌వోలు శంకరయ్య, రంగముని, వెంకటేశ్వర్లు ఉన్నారు.

'హైందవ శంఖారావానికి తరలిరావాలి'

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి హిందువులు తరలిరావాలని వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి గిరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి హిందువులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యనిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మురళి, దమాం సురేష్, రాజేష్, మల్లేష్ నాయుడు, వేల్పుల గోపాల్, శివశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా రజక కార్తీక వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రజక ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రజక కార్తీక వనభోజనం ఆదివారం నిర్వహించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కిసాన్ ఘాట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రజకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలకు, మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయ కులు వాడాల నాగరాజు, వేంపేట రాంబాబు క్యాతూరు మధు, న్యాయ వాది ఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం షాపులు దూరంగా ఉండాలి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు గుడికి, బడికి దూరంగా ఉండాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. ఆదివారం నగరంలోని రోజావీధిలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కొత్త మద్యం పాలసీ అమలు చేస్తున్నప్పటికీ నియమనిబంధనలు అమలు కావడం లేదన్నారు. మద్యం షాపులు ఏర్పాటు చేసే ముందు వార్డు, గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మాణం జరిగిన తర్వాతే దుకణాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దానేశ్వరీ, మీనాక్షి, పార్వతమ్మ, ముంతాజ్, నాగరాజు, వెంకటేష్, విశ్వదిరాం పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం


ఎంపీ బస్తిపాటి నాగరాజును సన్మానిస్తున్న దేవేంద్రప్ప

కర్నూలు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కురువ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన మాన్వి దేవేంద్రప్ప కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాల యంలో దేవేంద్రప్పను ఆయన్ను కలిసి శాలువతో సత్కరించారు. తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఎంపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

షూటింగ్ బాల్ విజేత పల్నాడు జిల్లా జట్టు


ట్రోఫీ అందుకుంటున్న పల్నాడు జిల్లా జట్టు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుంచి జరుగుతున్న ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ విజేతగా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. రెండోరోజూ పోటీల ముగింపు కార్యక్రమానికి గుడ్‌షప్పర్డ్ పాఠశాల కరస్పాండెంట్ యేసుదాసు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని అన్నారు. మరో అతిథి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిం చాలన్నారు. సీనియర్ పురుషుల విభాగంలో విజేతగా పల్నాడు జిల్లా, ద్వితీయ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా, తృతీయ స్థానంలో అన్నమయ్య జిల్లా జట్లు నిలిచినట్లు నిర్వహకుడు నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఏపీ షూటింగ్ బాల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, కళ్ల నాగవేణి, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు


విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న అతిథులు

సి.బెళగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ గురుకుల పాఠశాల అవరణలో జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా జ్యోతిరావుపూలే సమన్వయకర్త యమునాదేవి మాట్లాడుతూ అండర్ 14, 17 సెపక్‌తక్రా పోటీల్లో బాలుర, బాలికల విభాగాల్లో మొదటి స్థానం పశ్చిమ గోదావరి జిల్లా, రెండో స్థానం కృష్ణ జిల్లా, మూడో స్థానం అనంతపురం జిల్లాలు విజేతలుగా నిలిచారు. వీరికి ఏపీ అసిస్టెంట్ సెక్రటరిలు గిడ్డయ్య, సుందరరావు, పరమేష్, ప్రిన్సిపాల్ బలరాముడు, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్‌కమిటీ చైర్మన్ గోవిందు చేతుల మీదుగా షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు, మాజీ ఎంపీటీసీలు ధనుంజయుడు, బాలాజివెంకటేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పతకాలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 రగ్బీ పోటీల్లో జిల్లా బాలికలు బంగారు, బాలురు రజిత పతకాలను సాధించారు. జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడంపై ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిడ్డయ్య, ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటరు నమోదుకు 284 దరఖాస్తులు: కమిషనర్


ఓటరు నమోదును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదుకు 284 దరఖాస్తులు వచ్చినట్లు నగర పాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్ర బాబు అన్నారు. ఆదివారం కేవీఆర్ జూనియర్ కళాశాల, మున్సిపల్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, రోజా స్ట్రీట్, ప్రకాష్‌నగర్ మున్సిపల్ హై స్కూల్, నరసింహారెడ్డినగర్, కప్పల్‌నగర్, లేబర్ కాలనీ, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేయగా.. కొత్త ఓటు నమోదుకు సంబంధించి ఫారం-6కు 73, మృతిచెందిన మరో పోలింగ్ కేంద్రానికి ఓటు మార్పు వంటి కారణాలతో ఓటు తొలగింపునకు సంబంధించి ఫారం-7కు 62, పేరు, చిరునామా తదదితర వివరాల మార్పునకు సంబంధించి ఫారం-8 149 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొత్త ఓటు నమోదు, వివరాల మార్పు, తొలగింపునకు వంటి సేవలకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా స్థానిక బీఎల్వోల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

ప్రజలపై మోపిన భారం తగ్గించాలి


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన భారాలను తగ్గించాలని సీపీఎం న్యూసిటీ నాయకులు కే.ప్రభాకర్, కే.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని 32వ వార్డు ముజఫర్‌నగర్ ప్రజా పోరుయాత్ర నిర్వహించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేయడం సరికాదని, ఆ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్న ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు చేరుకున్న భక్తి చైతన్య పాదయాత్ర

ఓర్వకల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో శనివారం బయలుదేరిన తిరుమల వేంకటేశ్వరస్వామి రథంతోపాటు భక్తిచైతన్య పాదయాత్ర ఆదివారం ఓర్వకల్లుకు చేరుకుంది. జీవేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

ఓర్వకల్లు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు గౌస్, అబ్దుల్లా, మోహన్‌బాబు, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు నిర్వహించే ప్రజాపోరు యాత్ర ఆదివారం మూడో రోజు నగరంలోని పలు కాలనీల్లో నిర్వహించారు. గరీబ్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో గురుశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించడంలో కూటమి ప్రభుత్వం వైఫ ల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, ఆర్.కృష్ణ, పార్వతయ్య, ఖాజాపాషా, అలివేలమ్మ, సీహెచ్.సాయిబాబా, సుధాకరప్ప పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వాసవీ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయంలో పార్వతీ సమేత శివలింగ విగ్రహ ప్రతిష్ఠను వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఉదయం 11.45 గంటలకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠను భక్తుల మధ్య చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి రేనాటి నాగిరెడ్డి, కోశాధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఓ వైసీపీ లీడర్ ముస్తఫాపై దాడి జరిగిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ముస్తఫా తన ఆధీనంలో ఉన్న సీ క్యాంపులోని ప్రభుత్వ క్వాటర్‌ను మహేష్ అనే వ్యక్తికి బాడుగకు ఇచ్చాడు. అయితే మహేష్ అందులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో ముస్తఫా గట్టిగా నిలదీసి ఇల్లు ఖాళీ చేయాలని హెచ్చరించాడు. దీంతో మహేష్ తన మిత్రులతో కలిసి ఈ నెల 5వ తేదీన సాయంత్రం రామచంద్రమిషన్ వద్ద ముస్తఫాపై దాడి చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నిందితులు మహేష్‌బాబు, మంజునాథ్, భానుప్రకాష్, నాగేంద్రబాబు, నానీబాబులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు పంపించారు.

రోగి సంరక్షణకు రేడియాలజీ కీలకం


రాయలసీమ జోనల్ సీఎంఈలో పాల్గొన్న ప్రిన్సిపాల్, ఏపీఎంసీ అబ్జర్వర్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోగి సంరక్షణకు రేడియాలజీ కీలకమని ఏపీఎంసీ అబ్జర్వర్ డా.కృష్ణానాయక్ అన్నారు. ఆదివారం విశ్వభారతి మెడికల్ కాలేజీలోని జనరల్ హాస్పిటల్‌లో రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ జోనల్ వైద్య విజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించారు. రేడియాలజి హెచ్‌వోడీ డా.అబ్దుల్ గఫూర్, సీనియర్ ప్రొఫెసర్ డా.ఓ.జోజిరెడ్డి పర్యవేక్షణలో సీఎంఈ జరిగింది. దాదాపు రాయలసీమ పరిధిలోని వివిధ మెడికల్ కాలేజీల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎంసీ అబ్జర్వర్ డా.కృష్ణానాయక్, వీబీఎంసీ ప్రిన్సిపాల్ డా.మున్నీరుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ రేడియాలజిలో కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయని, వీటి వల్ల రోగుల వ్యాధి నిర్ధారణ, చికిత్సకు దోహదపడుతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన పీజీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

జీవో 117ని రద్దు చేయాలి: యూటీఎఫ్

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జీవో నెంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం గూడూరు పట్టణంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు రెండో రోజు కొనసాగాయి. రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావుతోపాటు రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా నాయకులు, మండల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

కోడుమూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలకు చెందిన 2005-06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా గత ఉపాధ్యాయులను దుశాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, నాగలక్ష్మి, మంజుల, మల్లేశ్వరి, ప్రమీల, విజయలక్ష్మి, సోమసుందరం, సత్యనారాయణరాజు, వెంకటేశ్వర్లు, వార్డన్ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేసీలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

● కాపాడిన స్థానికుడు

కర్నూలు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయబోగా రాజేష్ అనే వ్యక్తి ఆ మహిళను కాపాడాడు. ఈ ఘటన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జోహరాపురం వద్ద కేసీ కెనాల్‌లో జరిగింది. కల్లూరు చెందిన ఓ మహిళ కుటుంబ సమస్యలతో కేసీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకునేం దుకు జోహరాపురం సమీపంలోకి వచ్చింది. కేసీలో ఆ మహిళ దూకేయగా.. ఈ ఘటనను చూసిన రాజేష్ అనే వ్యక్తి వెంటనే కేసీలో దూకి ఆ మహిళను కాపాడి ఒడ్డుకు చేర్చారు. స్థానికుల సాయంతో మహిళను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. సమచారం తెలుసు కున్న వన్‌టౌన్ సీఐ రామయ్యనాయుడు, పోలీసులు ఆ యువతికి ఆసుపత్రిలో సరైన వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఆ మహిళ ప్రస్తుతం కోలుకుంటుంది. మహిళను కాపాడిన రాజేష్‌ను సీఐతో పాటు పోలీసులు అభినందించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రామూ యాదవ్, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలిలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ నాయకులు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును వేగవంతం చేశారు. ఆదివారం టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎన్.ఉదయ్ కుమార్, గుడి ఎల్లప్ప, నెట్టి కంటి నాగరాజు మాట్లాడుతూ రూ.100లు చెల్లించి టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకుంటే వారు ప్రమాదవశాత్తు మరణిస్తే.. వారి కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా టీడీపీ అందిస్తుందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేయించుకుని భద్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.



తాగు నీటికి కటకట

ఆదోని టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 2వ వార్డులోని బావాజీ పేటలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆదివారం వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు రోజులైనా తాగు నీరు రాకకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొళాయిలలో నీరు ఎప్పుడు వదులుతారో, లైన్‌మెన్‌లు ప్రజలకు చెప్పకుండా, అరగంట మాత్రం వదిలి కరెంట్ లేదని సరఫరాను నిలిపేయడంతో స్థానికులకు తాగునీరు లేకుండా పోయిందని వార్డు మాజీ టీడీపీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆరోపించారు. నిర్లక్ష్యంగా పని చేస్తున్న కింద స్థాయి సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెల్దుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర) లో సమావేశమయ్యారు. అందరూ ఒకే చోట చేరి నాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు పద్మశ్రీ, షబానా, చంద్రశేఖర్, శోభాదేవి, ఫాతీమా, విశ్వేశ్వరయ్య, శ్రీనివాసులు, రఫిక్, నాగన్న, వెంకటేశ్వర్లు, ప్రభుదాసులు హాజరయ్యారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

కురువ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన సన్మానం



కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన మాన్వి దేవేంద్రప్పను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన మాన్వి దేవేంద్రప్ప, కర్నూలు ఎంపీ బసత్తిపాటి నాగరాజులను కురువ సంఘం జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ముందుగా దేవేంద్రప్ప ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజును కర్నూలులోని తన కార్యాలయంలో కలిశారు. సన్మానం అనంతరం దేవేంద్రప్ప మాట్లాడారు. రాష్ట్రంలో కురువలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయడమే కాకుండా, ఎంపి నాగరాజుతో కలిసి కురువలకు ఇవ్వాల్సిన మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లుపై అధికారులకు సూచనలు ఇచ్చే విధంగా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతామన్నారు. తనకు చైర్మన్ రావడానికి సహకరించిన ఎంపీ బస్తిపాటి నాగరాజుతో పాటు మంత్రి సావితమ్మ, కర్నూలు జిల్లాలోని ఎమ్మెల్యేలు, మీనాక్షి నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆస్పరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోహరాపురం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదివారం కర్నూల్ సబ్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారులు రామకృష్ణ, విశ్వనాథ్, ప్రవీణ్ కుమార్ గ్రామంలో 64 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఐదుగురు రాము, రాఘవరెడ్డి, కాశీపతి, లోకేష్, బాబులపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. రెండు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు తెలిపారు.

దేవరగట్టులో కార్తీక మాసం ప్రత్యేక పూజలు

హొళగుంద, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం రెండో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు మహేష్ స్వామి, మల్లయ్యస్వామి ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ తెల్లవారు జాము నుంచి స్వామి అమ్మవారికి మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యల తరలివచ్చి స్వామి అమ్మవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చదరంగంతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుంది



మాట్లాడుతున్న స్పార్క్ చెస్ కోచ్ జంబులయ్య

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మేధోశక్తి పెరగాలంటే చరంగం ఎంతో ఉపయోగపడుతుందని స్పార్క్ చెస్ అకాడమీ కోచ్ జంబులయ్య నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వారికి ఇండోర్, అవుట్ డోర్ క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఎప్పుడు పుస్తకాలే కాదని వారు మానసికంగా ఎదగాంటే ఇలాంటి చదరంగం పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలలో 115 మంది చెస్ క్రీడాకారులు ఉత్సాహంగా టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు రూ.10వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సాయి జ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ సభ్యుడు కొల్లి శ్రీదర్, కర్నూలు స్పార్క్ చెస్ అకాడమీ సభ్యులు నందకిషోర్, స్వామి ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు, మహాదేవప్ప, ఐ ఫౌండేషన్ సభ్యులు విశ్వనాథ్, శివ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



కైరుప్పలలో బాధితుడు పక్కీరప్పకు నగదు చెక్కు, బియ్యం పంపిణీ చేస్తున్న గిడ్డయ్య

ఆస్పరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైరుప్పల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి సర్వం కోల్పోయిన బాధితుడు పక్కీరప్పకు సీపీఐ పార్టీ అండగా నిలిచింది. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, బండమీద వెంకటేశ్వరులు సేవా సమితి నాయకులు ఆదివారం బాధితుడు పక్కీరప్పకు రూ.50వేల నగదు చెక్కును, క్వింటం బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు విరుపాక్షి, సుంకన్న, శ్రీనివాసులు వీరేష్, మారన్న, ఉరకుందు, వీరభద్రి పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్‌లను తొలగించాలి



ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌కేడీ కాలనీవాసులు

ఆదోని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలోని సాయిబాబా నగరలో అనధికారికంగా నిర్వహిస్తున్న మెకానిక్ షెడ్లను తొలగించాలని కాలనీవాసులు కోరారు. ఆదివారం రాత్రి సాయిబాబా నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. ఎస్‌కేడీ కాలనీ సాయిబాబా నగర్ రెసిడెన్షియల్ ఏరియా అయినప్పటికీ కమర్షియల్‌గా షాపులు మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ షాప్, బీఫ్ బిర్యాని హోటల్స్ ఏర్పాటు చేసి ఏరియాలో సౌండ్ పొల్యూషన్, ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ ప్రదేశాన్ని ఒకసారి అధికారులు పరిశీలిస్తారని ఆ తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హామీలు నెరవేర్చాలి

తుగ్గలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జొన్నగిరిలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీపీఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మద్దికెర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రత్యేక అధికారి, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని హంపా, పెరవలి గ్రామంలో ఓటు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుదం లాంటిదన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు అందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి: సీపీఐ

కోసిగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో బోరుబావుల కింద ఉల్లి పంట సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ మంత్రాలయం నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ కోరారు. ఆదివారం కోసిగి మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఉల్లి రైతులతో సమావేశమై ఉల్లిగడ్డ పంటను పరిశీలించారు. ప్రభుత్వం ఉల్లి క్వింటం రూ.3వేల నుంచి రూ.4వేల వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉల్లి పంటను ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్తే లారీ, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, వ్యవసాయ కూలీల ఖర్చులు కూడా రైతులకు మిగలడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు నరసమ్మ, రాజేశ్వరి, నీలమ్మ, రాకేష్, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు కుదేలు

- పంటను దున్నేస్తున్న అన్నదాతలు
- పశువులకు గ్రాసంగా వదిలేస్తున్న వైనం
- మరో పంట సాగు కోసం సన్నద్ధం

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పత్తిపంటను నమ్ముకున్న రైతన్నలకు ఈఏడాది అప్పులే మిగిలాయి. పంట చేతికందే సమయంలో తుఫాను ప్రభావంతో తీవ్రనష్టం వాటిల్లింది. గత ఏడాదితీవ్ర కరువుతో అల్లాడిన రైతులు ఈఏడాది అతివృష్టి కారణంగా పత్తిరైతులు కుదేలయ్యారు. అధికవర్షం కారణంగా పంటంతా ఎర్రగా మారింది. గులాబిరంగు పురుగుసోకి పంటనంతటిని నమిలేసింది. ఎన్ని మందులు వాడినా అదుపుకాకపోవడంతో మూగ జీవాలకు పత్తిపంటను గ్రాసానికి వదిలేశారు. మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన కమ్మరి వీరేష్, కమ్మరి నాగయ్య, ఈడిగ ఈరన్న గౌడు, బెస్త నారాయణమ్మ సాగుచేసిన పత్తిపంటను పశువులకు మేతగా వదిలేశారు. అదేవిధంగా మాధవరం, వగరూరు, సూగూరు, బూదూరు, వి.తిమ్మాపురం, మాలపల్లి గ్రామాల్లోని రైతులు వందల ఎకరాల్లోని పంటలను దున్నేశారు. దాదాపు లక్షలు ఖర్చు పెట్టి పత్తిసాగుచేస్తే పెట్టుబడి సైతం రాలేదని వాపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో కొంతమంది రైతులు పంటను పీకేయడం, దున్నేయడం, మూగజీవాలకు మేతగా వదిలేయడం వంటివి చేస్తున్నారు. పత్తికి అధిక రేట్లు ఉన్నాయన్న ఆశతో సాగుచేస్తే చివరికి అప్పులే మూటగట్టుకో వాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిపంటను తొలగించి మిరప, మొక్కజొన్న, వేరుశ నగ, కంది, జొన్న వంటి పంటలైన సాగు చేస్తే కొంతైనా ఊరట లభిస్తుందని రైతులు వాపోతున్నారు.


పత్తిపంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మంత్రి

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణబసప్ప దర్శనపూర్ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. మంత్రి వెంట అనంతపురాణిక్, జేపీ స్వామి, ఎస్ఐ పరమేష్ నాయక్, నరసింహ దేశాయ్, వ్యాసరాజాచార్, రంగస్వామి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మఠానికి రూ.20 లక్షల విరాళం

మంత్రాలయం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన గోపాలకృష్ణ , కుటుంబ సభ్యులు శ్రీమఠం అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం దాత కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.20లక్షలు చెక్కును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. సూపరింటెండెంట్ అనంత పురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్ పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవడంలో విఫలం

వినూత్న రీతిలో నిరసన

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడంలో విఫలమైందని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వీరేష్, నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు గొంతుకు ఉరితాడు బిగించికొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామన్నారు. తక్షణమే ఉచిత ఇసుక విధానంపై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పనులు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలే స్వయంగా తుంగభద్ర నదిలో ఇసుకను తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నరసింహులు, సుంకన్న, రామాంజినేయులు, నరసప్ప, రవి, వీరేష్, జగన్నాథ్, హనుమంతు, శ్రీనివాసులు, వెంకటేష్, రంగస్వామి, మునుస్వామి పాల్గొన్నారు.


గొంతుకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు



నవరత్నాల రథంపై ఊరేగిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కార్తీక నవమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను ఉంచి ఆలయ ప్రాంగణలో ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు.

● రాఘవేంద్ర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.

ట్రాన్స్‌కో ఏఈగా ప్రసన్నాంజనేయులు

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ ట్రాన్స్‌కో ఏఈగా ప్రసన్నాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న పసన్నాంజనేయులు బదిలీపై ఎమ్మిగనూరు పట్టణ ఏఈగా వచ్చారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామన్నారు.

12న జాబ్ మేళా

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్య శిక్షణాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న ఎమ్మిగనూరు పట్టణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి దీప్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్ మేళా ఉంటుందన్నారు. మేళాలో కేఎల్ గ్రూప్స్ (జెప్టో, స్విగ్గీ), ఎల్అండ్ టీ కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. పదోతరగతి, ఇంటర్ (ఇంగ్లిష్ చదవగలగాలి), స్కిల్ టెక్నిషియన్స్‌కు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ(ఫిట్టర్, సివిల్, కార్పెంటర్, వెల్డర్, ఎలక్ట్రికల్‌లో డిప్లమా చేసిన వారు) అర్హులన్నారు. అర్హులైన నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

'బీజేపీ నాయకుల జోలికి వస్తే సహించం'

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బీజేపీ నాయకుల జోలికి వస్తే సహించేది లేదని ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఎస్ ఈరన్న అన్నారు. ఆదివారం గీతానగర్‌లో పార్టీ కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటేశ్ యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం నందవరం మండలం పొణకలదిన్నెలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి అవుకు వెంకటేష్‌యాదవ్‌పై గ్రామంలోని వైసీపీకి చెందిన జీ వెంకటేష్ దుర్భాషలాడి దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: బీజేపీ

నందవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొణకలదిన్నె గ్రామంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అవుకు వెంకటేష్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తెలుగు ఈరన్న, బీజేపీ మండల అధ్యక్షుడు దేశాయి కేశవరావు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు, అన్యాయాలను ప్రశ్నించినందుకు వెంకటేష్‌పై దాడి చేశారన్నారు. పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

గోనెగండ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోరాటల ద్వారానే విద్యార్థుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐఎస్ఎఫ్ సంఘం తాలుకా అధ్యక్షుడు మునిస్వామి, ప్రభాకర్ అన్నారు. ఆదివారం గోనెగండ్లలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. మునిస్వామి మాట్లాడుతూ ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నెం 77ను రద్దు చేయాలని అన్నారు. వైద్య విద్యను దూరం చేస్తున్న జీవో 107, 108లను కూడా రద్దు చేయాని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జలీల్, బడిషావలి, దావూద్, పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

మంత్రాలయం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణంలోని అంజనేయస్వామి గుడి సమీపంలో గ్రామానికి చెందిన మల్లిఖార్జున అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండగా ఎస్ఐ పరమేష్ నాయక్ పట్టుకున్నారు. ఆదివారం 180 ఎంఎల్ మద్యం 41 మద్యం సీసాలను స్వాధీనం చే`సుకొని వ్యక్తిని అరెస్టుచేశారు. ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మంత్రాలయం పుణ్యక్షేత్రంలో మద్యం విక్రయించినా, సరఫరా చేసినా, బహిరంగా ప్రదేశాల్లో మద్యం తాగిన కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్ఐ హెచ్చరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది మల్లికార్జున స్వామి, రామకృష్ణ, పరమేష్, రాముడు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాన్ని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఈనెల 24న జరిగే కనకదాసు జయంతి, కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కురువ, కురుబ సంఘం నాయకులు మద్దిలేటి, భీరప్ప, ప్రిన్సిపాల్ కిష్టప్ప, మలయ్య, వెకంటేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో కురువ, కురుబ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్తీక వన భోజన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బీవీతోపాటు రాష్ట్ర మంత్రి సవిత, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారథి, ఏపీ, తెలంగాణ, కర్ణాటకలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు లక్ష్మన్న, సోమన్న, యాదగిరి, వీరేష్, శ్రీనివాసులు, మల్లికార్జున, ధనుంజయ, వెంకటరాముడు పాల్గొన్నారు.









